క్లుప్తంగా

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: సీఎం సహాయ నిధి పేదల పాలిట వరమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెంకు చెందిన ఉండ్రాజవరపు రమేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.5.50 లక్షల చెక్కును ముదునూరి తన కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. అరుదైన రోగాల బారిన పడి ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగాలకు వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయనిధి నుంచి సాయం అందిస్తున్నారని చెప్పారు. ఇంజేటి జాన్‌కెనడీ, ముసూడి రత్నం, అడిదల శరత్, పాలపర్తి బోస్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

మొగల్తూరు: మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో సుమారు 6వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సప్తాహ మహోత్సవం



కోదండరామస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: సీతారాంపురం నార్త్ పంచాయతీలోని పట్టాభిరామాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 60వ సప్తాహ మహోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, హరికథలు, నాదస్వరం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ చాలీసా, తులసి, కుంకుమ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం పూర్ణాహుతి, సామ్రాజ్య పట్టాభిషేకం, శాంతి కల్యాణం, స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



కంటి చికిత్స చేయించుకున్న వృద్ధులతో వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న నలుగురు వృద్ధులకు చికిత్స చేయించామన్నారు. రూ.27 వేల వ్యయంతో పైడావ గ్రామానికి చెందిన కొత్తలంక కృష్ణారావు, కొంతేరుకు చెందిన కానుకొలను సరోజిని, పూలపల్లికి చెందిన కంటిబోయిన తులసమ్మ, భీమవరానికి చెందిన బర్రె కృష్ణమూర్తికి ఆపరేషన్ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, పోతుల ఉమాశంకరరావు, మానెం బసవరాజు, జంపన ప్రసాద్, నంబూరి గంగాపవన్, జవ్వాజి కళ్యాణ్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అందరికీ వరం

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు ప్రజలకు ఒక వరంలాంటిదని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, ఎంపీడీఓ ఎస్ రవీంద్ర అన్నారు. శుక్రవారం చెరుకువాడలో నిర్వహించిన రెండో దశ జగనన్న ఆరోగ్యసురక్ష హెల్త్ క్యాంపును సర్పంచ్ సాంబశివరావు ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య ఖర్చు పరిధిని రూ.25 లక్షలకు పెంచి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి మరింత రక్షణ కల్పించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కొడలరావు, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డు నాగన్న, వార్డు సభ్యుడు బిల్‌మోరియా, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం జగన్

- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోన్నత ఘట్టం
- ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం: బస్సుల ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



పోడూరు: అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బస్సుల్లో విజయవాడ వెళుతున్న నాయకులు

నరసాపురం: అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. విజయవాడలో నెలకొల్పిన అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణకు నరసాపురం నియోజకవర్గం నుంచి ముదునూరి ఆధ్వర్యంలో జనం భారీగా తరలి వెళ్లారు. 20 బస్సులు, 40 కార్లలో దళితులు, దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ అభిమానులు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బస్సుల ర్యాలీని ముదునూరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దళితుల సంక్షేమానికి, వారికి రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం విజయవాడలో రూ. 600 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు చేయడం మహోన్నత ఘట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వంగలపూడి జక్కరయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి ఆనంద్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి, పార్టీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, కడలి రాంబాబు, వంగలపూడి ఏషయా, గోగులమండ సుగుణరావు, కేసీఆర్ విజయవాడ వెళ్లారు.

విజయవాడకు బస్సుల్లో పయనం

మొగల్తూరు: విజయవాడలో నిర్మించిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభంతో పాటు సామాజిక సమతా సంకల్ప సభకు నియోజకవర్గం నుండి వేలాది మంది నాయకులు, అభిమానులు, తరలి వెళ్లారు. విజయవాడ వెళ్లే బస్సులకు నరసాపురం అంబేడ్కర్ సెంటర్, మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విజయవాడకు తరలి వెళ్లే నాయకులతో కలిసి బస్సులో చీఫ్‌విప్ ప్రసాదరాజు ప్రయాణించారు. మొగల్తూరు మండలం నుంచి వెళ్లిన వారిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులతోపాటు దళిత సంఘాల నాయకులు కొల్లాబత్తుల రవికుమార్, ఏగి బాబి, కోడెళ్ళి వెంకట్రావు, కొల్లాబత్తుల సత్యానందం, కొల్లాబత్తుల రాంపండు తదితరులున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఉత్సాహంగా తరలివెళ్లిన నాయకులు

పోడూరు: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి దళిత నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆచంట నియోజకవర్గం పరిధిలోని పోడూరు, కవిటం, గుమ్మలూరు, పండితవిల్లూరు, మినిమించిలిపాడు, జగన్నాథపురం, తూర్పుపాలెం, పి.పోలవరం గ్రామాల నుంచి, పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని జిన్నూరు, పెనుమదం, వేడంగి, మట్టపర్రు, కొమ్ముచిక్కాల, వద్దిపర్రు, అప్పన్నచెరువు, రావిపాడు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో తరలి వెళ్లారు. మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, పితాని చిన్నా, కార్పొరేషన్ డైరెక్టర్లు పెదపాటి పెద్దిరాజు, పోతుమూడి రామచంద్రరావు, జేసీఎస్ కన్వీనర్లు బళ్ల రాజశేఖర్, పైడి ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, సబ్బితి సాగర్, బుడితి భీమారావు, దిద్దే శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు తదితరులు విజయవాడ వెళ్లారు.

భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెనుగొండ: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప సభకు ఆచంట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో 2వేలకు పైగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. శుక్రవారం ఉదయం పెనుగొండ మండలంలో బస్సులను ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. పెనుగొండ, దేవ, ఇలపర్రు, వెంకట్రామపురం, సిద్ధాంతం నుంచి బస్సులు బయలు దేరారు. ఆచంట మండలం నుంచి వేలాదిగా నాయకులు తరలివెళ్లారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులు

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ప్రతిష్ఠించి దళిత జాతికి అంకితమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని రాష్ట్ర పీవీ రావు మాలమహానాడు అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ శుక్రవారం అన్నారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి విజయవాడ విగ్రహావిష్కరణకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గుమ్మాపు వరప్రసాద్, పొన్నమండ బాలకృష్ణ, కొత్రపాటి వీరాస్వామి, నాతి శ్రీనివాస్, దేవా రాజేష్, పెదపాటి పెద్దిరాజు, ఇంజేటి కుమార్, పానుకు దైవకృప, బుంగా జయరాజు, చెరుగొండి పద్మకిషోర్, నేలపాటి రాజబాబు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన నాయకులు, కార్యకర్తలు

పాలకొల్లు అర్బన్: అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం పాలకొల్లు నియోజకవర్గం నుంచి పలువురు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత, బహుజనులు తరలివెళ్లారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, సచివాలయాల జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, వార్డు ఇన్‌చార్జ్‌లు విజయవాడ వెళ్లిన వారిలో ఉన్నారు.

సుమారు రెండు వేల మంది పయనం

పెనుమంట్ర: మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో నియోజకవర్గం నుంచి 16 బస్సులు, ఇతర వాహనాలపై సుమారు 2వేల మందికి పైగా విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పెనుమంట్ర మండలం నుంచి వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బుర్రా రవికుమార్ ఆధ్వర్యంలో 500 మందికి పైగా తరలివెళ్లారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి శుక్రవారం యాత్రను ప్రారంభించారు. యాత్రలో రాష్ట్రవిద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరు వేణుమాధవరెడ్డి, వైస్ ఎంపీపీ ఈది అనిత ప్రవీణ్, బీసీ సెల్ అధ్యక్షుడు దొంగ దుర్గా ప్రసాద్, సర్పంచ్‌లు తాడిపత్రి ప్రియాంక, ప్రసన్నకుమార్, మట్టా కుమారిరాము, ఎంపీటీసీ సభ్యులు గెద్దం ఈశ్వరుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మొగల్తూరు: ముత్యాలపల్లిలో విజయవాడకు తరలి వెళుతున్న దళిత నాయకులు



పాలకొల్లు అర్బన్: గాంధీబొమ్మల సెంటర్ నుంచి బస్సులో విజయవాడ వెళుతున్న నాయకులు, కార్యకర్తలు



పాలకొల్లు సెంట్రల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



పెనుగొండ: సామాజిక సమతా సంకల్ప సభకు బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పెద్ద తదితరులు

ప్రభుత్వ స్థలాల్లోనే చెత్త వేయాలి



గవరపేటలో ఉపాధి హామీ పనులను వివరిస్తున్న డీఆర్‌పీ రాము

పాలకొల్లు అర్బన్: సర్వే ద్వారా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆ ప్రాంతంలోనే చెత్తను వేయాలని, రోడ్డు పక్కల వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు కోరారు. పాలకొల్లు మండలం గవరపేటలో సర్పంచ్ పొలిమేర వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో 2023–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను గ్రామ సభలో చదివి వీటిపై అభ్యంతరాలు కోరారు. గ్రామంలో గతేడాది చేసిన పనులకు వేతనాలు తమ బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని పలువురు కూలీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దశల వారీగా కూలీల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయని డీఆర్‌పీ పి రాము వివరించారు. గ్రామంలో 4 ఫీల్డ్ ఛానెల్స్ మరమ్మతులు, 14 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ బిల్లులకు రూ.3,28,084 కూలీల ఖాతాల్లో జమ అయ్యిందని వివరించారు. 369 మందికి జాబ్‌కార్డులుండగా 144 మంది ఉపాధి హామీ పనులు చేశారన్నారు. ఎంఈవో ఆర్‌ఎన్‌వీఎస్ గంగాధరశర్మ గ్రామ సభను పర్యవేక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్ జయబాబు, వీఆర్వో రామారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



జిన్నూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మణిత్యాగి

పోడూరు: పేదల ఆరోగ్యానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఎంతో భరోసాగా నిలుస్తుందని జిన్నూరు సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. జిన్నూరులో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బేబీ మహాలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంచి సంకల్పంతో పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణిత్యాగి, వైద్యులు డాక్టర్ సంతోష్‌కుమారి, డాక్టర్ సుష్మ, డాక్టర్ సత్యనారాయణ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీపీ సుమంగళి సాగర్, సీహెచ్‌ఓలు సత్యనారాయణ, వీరమ్మ, పీహెచ్‌ఎన్‌మేరీగ్రేస్, హెచ్‌వీ పద్మ, ఆరోగ్య సిబ్బంది చిన్నారి, ఇ.భాగ్యలక్ష్మి, ఎ.గౌరీదేవి, ఆశాకార్యకర్తలు శిబిరంలో సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 జి.సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్యరాజు, సచివాలయ కార్యదర్శులు వి.రాంబాబు, విష్ణు, హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్.శివజ్యోతి పాల్గొన్నారు.

జోరుగా దాళ్వా వరి నాట్లు



లంకలకోడేరులో వరి చేనులో దమ్ముచేస్తున్న దృశ్యం



పాలకొల్లు మండలం లంకలకోడేరులో ఏపుగా ఎదిగిన నారుమడి

4,450 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి

పాలకొల్లు అర్బన్: దాళ్వా పనులకు సంబంధించి వరినాట్లు చకచకా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగ హడావుడితో గడిపిన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పాలకొల్లు మండలంలోని 27 గ్రామాల్లో 9,181 ఎకరాల్లో వరి భూమి సాగులో ఉండగా ఇప్పటికే 4,450 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. బల్లిపాడు, పాలమూరు, శివదేవునిచిక్కాల, దగ్గులూరు గ్రామాల్లో 80 శాతం వరినట్లు పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో 20 నుంచి 30శాతం మాత్రమే నాట్లు వేశారు. ఈ నెలాఖరుకి వరినాట్లు పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖాధికారులు రైతులకు సూచిస్తున్నారు. నాట్లు ఆలస్యమయితే దాళ్వా పంట చివరలో సాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని వారన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే



నరసాపురం: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



యలమంచిలి : ఆర్యపేటలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్

పోడూరు: కులగణన సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు సర్వే సిబ్బందిని ఆదేశించారు. పోడూరులో కులగణన సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం నుంచి సర్వే ప్రారంభమైనట్లు తెలిపారు. కులగణన సర్వే పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఇంటింటా సర్వే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్, ఆర్‌ఐలు కె.రాంబాబు, ఎస్.త్రిమూర్తులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే పక్కాగా చేయాలి

నరసాపురం: కుల గణన సర్వే పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన కార్యక్రమం పట్టణంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమిషనర్ మున్సిపల్ కార్యాలయంలో నోడల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించి, కులగణనపై సూచనలు చేశారు. ఈనెల 28వ తేదీ వరకూ ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ స్థితిగతులను నమోదు చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి వి.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి

యలమంచిలి: కులగణన సర్వేకు ప్రజలంతా తమ సహకారం అందించాలని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన ఈ సర్వేను ఆర్యపేటలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటికీ వచ్చి కుటుంబ సభ్యుల వివరాలతోపాటు వ్యక్తిగత, ఆర్థిక, వ్యవసాయ, పాడి తదితర వివరాలు సేకరిస్తారని అన్నారు. కులాల వారీగా రాష్ట్ర ప్రజల స్థితిగతులు తెలుసుకుని, వారి అభివృద్ధికి మరిన్ని పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తుందన్నారు. ప్రజలంతా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ ఇళ్లకు వచ్చిన సమయంలో అన్ని వివరాలు తెలియజేసి, వారికి సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి పాలా శారద శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి నాగలక్ష్మి, వీఆర్వో సురేష్ తదితరులు ఉన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వీకే వీరభద్రరావు తెలిపారు. ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ముఖ్య అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొంటారన్నారు. మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటారన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

క్రీడల్లో యువత సత్తా చాటాలి



గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతిని అందజేస్తున్న నాయకులు

నరసాపురం రూరల్: యువత క్రీడారంగం పై దృష్టి సారించి క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మనదేశ ప్రతిష్టను ఇనుమడింపజేయవచ్చని రాష్ట్ర అగ్నికుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి 19 వరకూ వేములదీవి పడమర గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ అడ్డాల శ్రీనివాసరావు, సువర్ణభూమి డైరెక్టర్ ఉలిశెట్టి శ్రీనివాస్, ఉంగరాల శంకర్, శుభంకరీ ఇన్‌ఫ్రా డెవలపర్ పాలపర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర, పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.132/2022

బిట్వీన్ :
వాది: కాండ్రేగుల అప్పారావు
Vs
ప్రతివాది :
కానుమిల్లి వీర వెంకట సత్యనారాయణ
టు :
కానుమిల్లి వీర వెంకట సత్యనారాయణ,
S/o వజ్రభదరరావు
తూర్పుపాలెం, పోడూరు మండలం, JCJC
పై నంబరు పిటీషనులో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించనను మీరు పుచ్చుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ సారి సదరు ప్రతివాదికి అమలు జరుగబోవు దావా విషయములు Substituted Service by way of Publication ద్వారా అమలు జరిపించు నిమిత్తం ది.16.02.2024వ సం.తేదీన వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు వాయిదా తేది ది.16.02.2024వ సం.తేదీన ఉదయం గం.10.30ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును. గాన ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.
(By Order of The Court)
ఇట్లు :
కొప్పర్తి వెంకట సుబ్రహ్మణ్యం
అడ్వకేటు, B.Com.,B.L.,
పాలకొల్లు - 534260
ప.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ : 9866068748
పాలకొల్లు,
తేది:19.01.2024

మహారాష్ట్ర, పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No:437/2022 in O.S.No.132/2022

బిట్వీన్ :
పిటీషనర్ / వాది: కాండ్రేగుల అప్పారావు
Vs
రెస్పాండెంట్ / ప్రతివాదులు :
కానుమిల్లి వీర వెంకట సత్యనారాయణ
టు :
కానుమిల్లి వీర వెంకట సత్యనారాయణ,
S/o వజ్రభదరరావు
తూర్పుపాలెం, పోడూరు మండలం, JCJC
పై నంబరు పిటీషనులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు పిటీషన్ కాపీలు పంపించనను మీరు పుచ్చుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ సారి సదరు రెస్పాండెంట్ అమలు జరుగబోవు పిటీషన్ విషయములు Substituted Service by way of Publication ద్వారా అమలు జరిపించు నిమిత్తం ది.16.02.2024వ సం.తేదీన వాయిదా వేసియున్నారు. కావున రెస్పాండెంట్ అయిన మీరు వాయిదా తేది ది.16.02.2024వ సం.తేదీన ఉదయం గం.10.30ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును. గాన ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.
(By Order of The Court)
ఇట్లు :
కొప్పర్తి వెంకట సుబ్రహ్మణ్యం
అడ్వకేటు, B.Com.,B.L.,
పాలకొల్లు - 534260
ప.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ : 9866068748
పాలకొల్లు,
తేది:19.01.2024